సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 1 । జూలై । 2023



119 శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి కొత్తగూడెం ఏరియాలో జూన్ నెలలో 119 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైందని ఏరియా జీఎం షాలేం రాజు తెలిపారు. IIలో



'బడిబాట'లో ఇల్లెందుకు స్థానం!

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన ఊరు -మన బడి బ్రోచర్లలో ఇల్లెందుకు చెందిన మూడు స్కూళ్ల ఫొటోలకు స్థానం దక్కింది. IIలో

గరిష్టం / కనిష్టం 35° / 26°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉంటుంది.

అన్నదాతలకు అండగా 'సాక్షి'

జిల్లా వ్యవసాయాధికారితో నేడు 'ఫోన్ ఇన్'



అభిమన్యుడు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వానాకాలం పంటల సీజన్ మొదలైంది. ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యాన పంటల సాగుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తనాల ఎంపిక, నాటడంలో మెళకువలు, నకిలీ విత్తనాలను గుర్తించడం ఎలా తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని 'సాక్షి' సంకల్పించింది. ఈమేరకు శనివారం 'ఫోన్ ఇన్' ఏర్పాటు చేయగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కొర్స అభిమన్యుడు పాల్గొని రైతుల సందేహాలకు సమాధానాలు ఇస్తారు. రైతులు తమ సందేహాల నివృత్తి కోసం నిర్ణీత సమయంలో ఫోన్ చేయొచ్చు.

తేదీ : 01 - 07 - 2023, శనివారం
సమయం : ఉదయం 11-30 నుంచి 12-30 గంటల వరకు
ఫోన్ చేయాల్సి నంబర్లు
83740 32617, 99512 97497

న్యూస్‌రీల్

బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కొత్తగూడెంటౌన్: జిల్లాను బాల కార్మిక రహితంగా తీర్చిదిద్దాలని ఎస్పీ వినీత్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి నుంచి ఈనెల 31వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో బాల కార్మికులను గుర్తించి బడికి పంపించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో గత ఆరేళ్లలో 348 మంది బాల కార్మికులను సంరక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. పరిశ్రమలు, వ్యాపార సముదాయాల్లో బాల కార్మికులతో పని చేయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరావు, కార్మిక శాఖ సహాయాధికారి రవి, చైల్డ్ లైన్ అధికారి రాజ్‌కుమార్, ఎల్‌సీపీఓ శివకుమారి పాల్గొన్నారు.

బోధన సిబ్బంది భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: ఖమ్మం రీజియన్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో తాత్కాలిక ప్రాతిపదికన బోధన సిబ్బందిని భర్తీ చేయనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. డిగ్రీ లేదా పీజీలో 55శాతం మార్కులతో పాటు బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన వారు 3 నుంచి 7వ తేదీ వరకు భద్రాచలంలోని ఐటీడీఏ సమన్వయ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, మార్కులు, డెమోలో ప్రతిభ ద్వారా ఎంపిక ఉంటుందని వెల్లడించారు. కాగా, మహిళా విద్యాలయాల్లో మహిళలకు మాత్రమే అవకాశమిస్తామని పీఓ తెలిపారు.

పలువురు అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఎస్‌వోటూ డైరెక్టర్(పా) గా విధులు నిర్వహిస్తున్న ఈజీఎస్ ప్రకాశ్‌రావును సింగరేణి సూపర్‌బజార్ ఎండీగా బదిలీచేస్తూ జీఎం కుమార్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈఈ సెల్ పర్సనల్ డీజీఎం ఏజే మురళిధర్‌ను ఎస్‌వోటూ డైరెక్టర్(పా)గా బదిలీ చేశారు. వీరితో పాటు మరి కొందరికి ప్రమోషన్లు కల్పిస్తున్నట్లు తెలిపారు.

'స్త్రీనిధి'ని సద్వినియోగం చేసుకోవాలి

జూలూరుపాడు: స్త్రీనిధి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం ఆర్ఎం కలకోటి సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సెర్ప్ కార్యాలయంలో గ్రామ సమాఖ్య సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్త్రీనిధితో ప్రత్యేక పథకాలు ఎలక్ట్రిక్ ఆటోలు, ప్యాసింజర్ ఆటోల కొనుగోలుకు రూ.3 లక్షల రుణం అందజేస్తామన్నారు. పాత బైక్‌లకు రూ. 40 వేలు, కొత్త బైక్‌లకు రూ. 75 వేలు రుణం ఇస్తామని, ఇళ్ల మైనర్ రిపేర్లకు రూ.75 వేలు, 100 పెరటి కోళ్ల పెంపకానికి రూ. 25 వేలు రుణాలు ఇస్తామని వివరించారు. డ్వాక్రా సంఘ సభ్యుల పిలలకు ల్యాప్ టాప్‌ల కోసం రూ. 35 వేలు రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ ఎం.సంపత్, సెర్ప్ ఏపీఎం సత్యనారాయణరాజు, సీసీలు బి. మధుసూదన్‌రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదివాసీలు ఇక అన్నదాతలు

రాష్ట్రంలో మూడో వంతు పోడు పట్టాలు ఈ జిల్లాలోనే..

- నగటున ఒక్కో కుటుంబానికి మూడెకరాల భూమి
- వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలి
- పట్టాల పంపిణీలో వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు
- ఇది మరుపురాని ఘట్టమన్న మంత్రి పువ్వాడ



మహిళా రైతుకు పట్టా అందిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ, విప్ రేగా, ఎంపీలు నామ, వద్దిరాజు, కలెక్టర్ అనుదీప్, పీఓ గౌతమ్, ఎమ్మెల్యేలు వనమా, మెచ్చా, హరిప్రియ



మాట్లాడుతున్న హరీశ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/పాల్వంచ/పాల్వంచ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు జారీ చేస్తుంటే అందులో లక్షన్నర ఎకరాలు.. అంటే మూడో వంతు భద్రాద్రి జిల్లాలోనే ఉందని రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పాల్వంచలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పోడు పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ప్రజాగాయకుడు, తెలంగాణ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్‌కు నివాళి అర్పించారు. అనంతరం ఐదు నియోజకవర్గాలకు చెందిన 27 మంది రైతులకు పోడు పట్టాలను మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అందించారు. తొలి పట్టాను పినపాక నియోజకవర్గానికి చెందిన పూనెం కౌసల్యకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇకపై జిల్లాలో పోడు గోడు ఉండబోదని, ఆదివాసీలంతా ఇక అన్నదాతలేనని చెప్పారు. మొత్తం 50, 595 మందికి పట్టాలు జారీ చేస్తున్నామని, సగటున ఒక్కో కుటుంబానికి మూడెకరాల భూమి అందుతోందని తెలిపారు. ఇకపై గిరిజనుల్లో పోడు రైతులు ఉండబోరని, అంతా భూయజమానులేనని అన్నారు. ఆదివాసీలు మాటకు కట్టుబడి ఉంటారని, ఎన్నో ఏళ్లుగా వారు అనుభవిస్తున్న పోడు కష్టాలకు పట్టాల పంపిణీతో పరిష్కారం చూపిన సీఎం కేసీఆర్‌ను ఆదరించాలని కోరారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లోనూ వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

గిరిజనుల కష్టాలు తెలుసు..

గోదావరి తీర ప్రాంతవాసినైన తనకు కోయలు, గిరిజనుల కష్టాలు తెలుసని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఒకేసారి లక్షన్నర ఎకరాల పోడు భూములకు పట్టాలు జారీ చేయడమనేది చరిత్రలో అరుదైన సంఘటన అన్నారు. ఒకప్పుడు జొన్న, మొక్కజొన్నలే ఎక్కువగా పండించే గిరిజన రైతులు ఇప్పుడు తోటలు సాగు చేసే స్థాయికి చేరుకున్నారని చెప్పారు. ఇక్కడ పట్టాలు అందని వారికి నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందిస్తామని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుక ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ఇంకా ఎవరేమన్నారంటే..

ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 75 ఏళ్ల పాలించిన వారు పరిష్కరించలేకపోయిన పోడు భూముల సమస్యలకు సీఎం కేసీఆర్ పదేళ్లలోనే పరిష్కారం చూపారని అన్నారు. **రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ..** రెండు దశాబ్దాలుగా గిరిజనులకు, అటవీ అధికారులకు మధ్య నలుగుతున్న సమస్యకు సీఎం కేసీఆర్ పరిష్కారం చూపారని చెప్పారు. కాగా తన ప్రసంగంలో భద్రాద్రి జిల్లా బదులు యాదాద్రి జిల్లా అని సంబోధించడం గమనార్హం. **కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..** పోడు భూముల విషయంలో కోయ, లంబాడాల తరఫున అనేక పోరాటాలు చేశానని, తన మీద, తన కుమారుడిపైనా అనేక కేసులు పెట్టారని, అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. **ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ..** తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతులు కష్టాలు ఒక్కొక్కటి గట్టెక్కుతున్నాయని, ప్రత్యేక పథకాలతో వారిని ఆదుకుంటున్నామని చెప్పారు.

ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. గతంలో ఎక్కడికి వెళ్లినా అందరూ పోడు పట్టాలు ఇవ్వాలని అడిగేవారని, ఇప్పుడా సమస్య తీరిపోయిందని అన్నారు. తమ నియోజకవర్గంలో 12,347 మంది రైతులకు పట్టాలు రావడం ఆనందంగా ఉందన్నారు. **అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ..** అక్కడక్కడా కొందరికి పట్టాలు అందలేదని, భూములు మిగిలి ఉన్న చోట అలాంటి వారికి కూడా ఇవ్వాలని కోరారు. **ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ..** పోడు పట్టాలు పొందిన వారికి రైతుబంధు అందిస్తామని ప్రకటించారు. షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి నిధులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. **కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ..** గతేడాది నవంబర్‌లో గ్రామ గ్రామాన తిరిగి 726 హాబిటేషన్ల నుంచి పోడు దరఖాస్తులు స్వీకరించామని, వాటి పరిశీలనకు 350 బృందాలను నియమించామని, సమగ్ర సమాచారంతో పక్కాగా పట్టాలు రూపొందించామని తెలిపారు.

కేసులు ఎత్తివేయాలి

ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ.. పోడు భూముల విషయంలో గిరిజనులు అనేక కష్టాలు పడ్డారని, వారిపై అధికారుల వేధింపులు చూసి తట్టుకోలేక గ్రామాల్లోకి అటవీ అధికారులు వస్తే చెట్టుకు కట్టేసి కొట్టాలంటూ పిలుపునిచ్చానని గతాన్ని గుర్తు చేసుకున్నారు. తనపై కూడా 15 కేసులు ఉన్నాయన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఈ విషయంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో అత్యధికంగా పినపాక నియోజకవర్గంలోనే పోడు పట్టాలు జారీ అవుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఫలాలను ప్రజలకు అందించేందుకే తాను పార్టీ మారానని, వేరే ఎజెండా ఏమీ లేదని వివరించారు. బీజేపీ రూ.100 కోట్ల ఆఫర్ ఇచ్చినా తిరస్కరించానని చెప్పారు. పట్టాలు జారీ అయినందున కొత్తగా పోడు చేయబోమని ప్రభుత్వానికి హామీ ఇస్తున్నామన్నారు.

అడ్రస్ లేని కోరం

జిల్లాలో అధికంగా ఉన్న గిరిజనులకు ఒకేసారి లక్షన్నర ఎకరాలకు పట్టాల పంపిణీ చేయడం అరుదైన విషయమని, ఇలాంటి సమయంలో ప్రజాప్రతినిధులంతా ఇక్కడ ఉండాలని కోరుకుంటారని రేగా కాంతారావు అన్నారు. ఇంతటి ముఖ్యమైన కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య హాజరుకాలేదని, అసలు ఆయన అడ్రస్ ఎక్కడో కూడా తెలియడం లేదని చెప్పారు. పుట్టబోయే బిడ్డకు ఇల్లరికం పోయినట్టు పోయాడని విమర్శించారు. ఇలాంటి నేతలకు కుర్చీల మీద ధ్యాస తప్ప ప్రజా సమస్యలు పట్టవని అన్నారు. అలాంటి వారు పార్టీకి రాజీనామా చేసి బయటకు వెళ్లాలని సూచించారు. కాగా, వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో గులాబీ రంగు చొక్కాతో ఉన్న కోరం కనకయ్య ఫొటోను ముద్రించడం గమనార్హం.

సభ సైడ్‌లైట్స్



మంత్రి హరీశ్‌రావుతో ఎమ్మెల్యే వనమా

- వీఐపీల పర్యటన వస్తుందంటే చాలు కొత్తగూడెం - పాల్వంచ పట్టణాల ప్రజలు హడలిపోతున్నారు. వీఐపీ కాన్వాయ్‌కి రూట్ క్లియరెన్స్ కోసం గంటల తరబడి జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను ఆపేస్తున్నారు. మంత్రుల పర్యటన షెడ్యూల్ ముందే వచ్చినా దానికి తగ్గట్టుగా ట్రాఫిక్ మళ్లించడమో లేక నిలిపివేత సమాచారమో ప్రజలు చేరవేయడం లేదు. శుక్రవారం సైతం మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ పర్యటన సందర్భంగా ఐడీఓసీ దగ్గర 30 నిమిషాలకు పైగా ఇరువైపులా ట్రాఫిక్ నిలిపేశారు. దీంతో ఇటు ఇల్లెందు క్రాస్‌రోడ్డు, అటు నవభారత్ వరకు ట్రాఫిక్ జాం అయింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.
- ఐడీవోసీలో ఉన్న మంత్రి హరీశ్‌ను కలిసేందుకు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుమారుడు వనమా రాఘవ ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు - రాఘవకు మధ్య వాగ్వాదం జరిగింది. తనను లోపలికి అనుమతించాలని రాఘవ కోరగా.. రూల్స్ మార్చేద్దామా అంటూ పోలీసులు బదులిచ్చారు. ఇంతలో ఐడీవోసీ నుంచి మంత్రి హరీశ్‌రావు బయటకు రావడంతో వివాదం సద్దుమణిగింది.
- పట్టాల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులకు స్థానిక ఎమ్మెల్యే వనమా స్వాగతం పలికారు. మంత్రి హరీశ్‌రావుతో సుగుణా గార్డెన్‌లో వనమా కలియదిరిగి నియోజకవర్గంలోని పరిస్థితులను వివరించారు.
- వేదికపై పట్టాలు జారీ చేస్తున్న సందర్భంగా ఓ రైతు మోకాలి పైకి లుంగీ కట్టుకుని వేదికపైకి రాగా, హరీశ్‌రావు పట్టా అందించే సమయంలో విప్ రేగా.. ఆ రైతుకు సైగ చేస్తూ లుంగీని కిందికి దించాలని సూచించాడు. అయితే రైతుకు ఆ విషయం అర్థం కాలేదు. దీంతో రేగా ముందుకు వచ్చి రైతు లుంగీని కిందికి అన్నారు.
- భద్రాచలం ఎమ్మెల్యే పొడెం వీరయ్య ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. దీంతో భద్రాచలం నియోజకవర్గ రైతులకు పట్టాలు అందించేటప్పుడు బాలసాని లక్ష్మీనారాయణ వేదికపై ముందుకొచ్చారు.
- మంత్రి పువ్వాడ మాట్లాడిన తర్వాత మరో మంత్రి హరీశ్‌రావును ప్రసంగిస్తారని అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు అంటుండగా.. అప్పటికే హరీశ్‌రావు పోడియం వద్దకు చేరుకుని 'నేను అందరికీ తెలుసులే, ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు' అంటూ ప్రసంగం మొదలెట్టారు.

నేడు గ్రూప్ -4 పరీక్ష

నిమిషం నిబంధన అమలు : కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని 77 కేంద్రాల్లో శనివారం గ్రూప్ - 4 పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణపై ఆయా అధికారులతో శుక్రవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేడు ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు నిర్వహించే పేపర్-1 పరీక్షకు 8 నుంచి 9.45 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పరీక్షకు 2.15 వరకు మాత్రమే అభ్యర్థులను అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ హాల్‌టికెట్‌తో పాటు ఫొటో, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకుని రావాలని సూచించారు. జిల్లాలో 27వేల మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, పరీక్ష నిర్వహణకు 77 మంది సూపరింటెండెంట్లు, 77 మంది లైజన్ అధికారులు, 36 మంది రూట్ అధికారులను నియమించామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీలైనంత త్వరగా పంపిణీ చేయండి

అంతకుముందు మంత్రులు హరీశ్‌రావు,అజయ్‌కుమార్ ఐడీఓసీని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అత్యధిక పట్టాలు ఈ జిల్లాలో ఉన్నాయని, వీలైనంత త్వరగా అందరికీ పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం పలువురు హరీశ్‌రావును సత్కరించారు.

ప్రతీ అడుగులో ప్రజల కష్టాలు కనిపించాయి

'పీపుల్స్‌మార్చ్'లో భట్టి విక్రమార్క

కూసుమంచి(ఖమ్మం రూరల్): ఆదిలాబాద్ నుంచి తాను చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ప్రతీ అడుగులో ప్రజల కష్టాలు కనిపించాయని.. తెలంగాణ సాధించుకున్న ఆశయం, లక్ష్యం నెరవేరలేదనే ఆవేదన ప్రజల్లో ఉందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం రాత్రి ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు నుండి ప్రారంభమై కోదాడ క్రాస్‌రోడ్ వద్ద ముగిసింది. భట్టి పాదయాత్ర 1,360 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా కిట్స్ కళాశాల వద్ద నిర్మించిన పైలాన్‌ను ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆవిష్కరించారు. పాటలు పాడి జనాన్ని ఉత్సాహపరిచారు. అనంతరం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు.

కష్టాలు చెప్పుకున్నారు...

రాష్ట్రంలోని 17 జిల్లాలు, 36 నియోజకవర్గాల్లో తన పాదయాత్ర సాగగా... ప్రజలు మమేకమై కష్టాలను చెప్పుకున్నారని భట్టి తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజలు పడుతున్న కష్టాలు ఆవిష్కృతమయ్యాయని అన్నారు. ఈ సమస్యలు, బాధలు దూరం కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారని భట్టి చెప్పారు. ఖమ్మంలో ఈనెల 2న జరిగే రాహుల్ సభకు ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా లక్షలాది మందితో విజయవంతం చేస్తామని తెలిపారు. మాజీ ఎంపీ వి.హన్మంతరావు మాట్లాడుతూ మండుతున్న ఎండను లెక్కచేయకుండా ప్రజల కోసం భట్టి పాదయాత్ర చేశారని చెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్ దొరపోకడలకు కాలం చెల్లిందన్నారు. ఈకార్యక్రమంలో భట్టి సతీమణి నందినితో పాటు ఎమ్మెల్యే పోదెం వీరయ్య, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పైలాన్ వద్ద భట్టి విక్రమార్క అభివాదం, పక్కన గద్దర్, వీహెచ్ తదితరులు

దమ్మక్క సేవాయాత్రకు ఆర్టీసీ బస్సులు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 3న దమ్మక్క సేవా యాత్రతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ రమాదేవి శుక్రవారం తెలిపారు. గిరిజనులను ఆలయానికి తరలించేందుకు భద్రాచలం నుంచి చర్ల, వాజేడు, కూనవరం, వీఆర్‌పురం, వినాయకపురం, గోగులపూడి, అశ్వారావుపేట రూట్లలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 3న ఉదయం 6.30 గంటలకు దమ్మక్క చిత్రపటంతో గిరి ప్రదక్షిణ, దమ్మక్క విగ్రహం వద్ద పూజలు, స్వామి వారి నిత్యకల్యాణం, సాయంత్రం గోవిందరాజ స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



వరద దాటి వెళ్తున్న డాక్టర్ మౌనిక, సిబ్బంది (ఫైల్)

- వైద్యుల చేయి పడితే శరీరానికి చికిత్స.. మనసుకు స్వాంతన
- కష్టకాలంలో ప్రజలకు అండగా సేవలు
- మారుమూల, ఏజెన్సీ పల్లెవాసుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

ప్రాణదాతలకు ప్రణామం !

భద్రాచలం అర్బన్: పోయే ప్రాణాన్ని నిలిపే శక్తి వైద్యుల సొంతం. అనారోగ్యంతో బాధపడేవారు వైద్యుల చెంతకు చేరగానే సగం ఊరట చెందుతారు. వైద్యులు ఇచ్చే మందులు, అంతకు మించి వారి నోట వచ్చే మంత్రం లాంటి మాటలు వ్యాధులను ఇట్టే నయం చేస్తాయి. అందుకే వైద్యులను ఇలలో దేవతలుగా భావిస్తారు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కథనం.

డాక్టర్స్ డే నేపథ్యం

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బీ.సీ.రాయ్ కోల్‌కతా మెడికల్ కాలేజీ, లండన్‌లో వైద్య విద్య పూర్తిచేశాక స్వదేశానికి వచ్చి సేవలు ప్రారంభించారు. కలకత్తా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేయడమేకాక మహాత్మాగాంధీతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 1961లో భారతరత్నతో సత్కరించింది. ఆయన జయంతి, వర్ధంతి రోజైన జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

పవిత్రమైన వృత్తి

సమాజంలో అత్యంత పవిత్రమైన, కీలకమైన వృత్తి వైద్యం. ఆపద సమయంలో ప్రజలందరికీ ఆపద్బాంధవుడిలా కనిపించే వైద్యులను ప్రజలు గౌరవిస్తారు. సాక్షాత్తు దేవుళ్లా కొలుస్తారు. ఇతరుల ప్రాణాలు నిలిపే అవకాశం డాక్టర్ వృత్తికి మాత్రమే ఉండడంతోపాటు తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంబీబీఎస్ చేయించేందుకు తపన పడతారు. కాగా, ఊళ్లో ఎందరు డాక్టర్లు ఉన్నా కొందరి 'హస్తవాసి' మంచిదని పేరొస్తుంది. ఆ 'హస్తవాసి' బాగున్న డాక్టర్ దగ్గరికే క్యూ కడతారు. బహుశా ఆ డాక్టర్ మాటతీరు, వ్యాధిని అంచనా వేసే పద్ధతి, వైద్యం చేసే విధానం హస్తవాసిని తీసుకొస్తుందేమో!

గోదావరి వరదల సమయాన..

ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, తదితర ప్రాంతాల్లో గతేడాది వరదల సమయాన గిరిజనులకు వైద్యం అందించేందుకు వరదలను సైతం లెక్క చేయలేదు డాక్టర్ మౌనిక. చర్ల మండలం సత్యనారాయణపురం పీహెచ్‌సీలో వైద్యురాలైన ఆమె ఏజెన్సీ పల్లెల్లో వైద్యశిబిరం నిర్వహించారు. సత్యనారాయణపురం వైద్యశాలకు 20 కి.మీ. దూరంలోని బట్టిగూడెంలో జ్వరాలు ప్రబలుతున్నాయని తెలియగానే కొంత దూరం మోటార్ సైకిల్‌పై.. అక్కడి నుంచి అడవిలో కాలినడకన తన బృందంతో వాగులను దాటుకుంటూ వెళ్లి గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి భేష్ అనిపించుకున్నారు. ప్రస్తుతం మౌనిక బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.

వైద్యుడి నుంచి ఐపీఎస్‌గా..



చిన్నారిని పరీక్షిస్తున్న ఎస్పీ డాక్టర్ వినీత్ (ఫైల్)

భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వర్తించి, ప్రస్తుతం జిల్లా ఎస్పీగా ఉన్న డాక్టర్ వినీత్ ఎంఎస్ ఆర్థోపెడిక్ వైద్యుడే. బెంగళూరులో మెడిసిన్ పూర్తి చేసుకుని, సంజయ్‌గాంధీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూనే సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. మొదటి ప్రయత్నంలోనే సివిల్ సర్వీసెస్‌కు ఆయన అర్హత సాధించారు. భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న సమయాన దుమ్ముగుడెం పోలీసులు, పర్ణశాల పీహెచ్‌సీ ఆధ్వర్యాన ములకలపల్లిలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎస్పీగా హాజరైన వినీత్.. వైద్యుడిగా మారిపోయి స్థానికులకు పరీక్షలు నిర్వహించడం విశేషం. ఇక్కడే కాదు ఏ శిబిరంలో సమయం లభించినా వైద్యుడిగా సేవలందించేందుకు వినీత్ ఇష్టపడతారు.

సవాల్‌తో కూడుకున్న విధులు..



గోదావరి వరదల సమయంలో చర్ల మండలంలో గల కొన్ని గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఈ సమయంలో ఆయా గ్రామాల్లో నివసించే ఆదివాసీలకు వైద్యం అందించాలనే తపనతో వరదలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. వైద్యురాలిగా ఉండి ప్రజలకు సేవ చేయడం దేవుడి దయగా భావిస్తున్నా. నిత్యం ప్రజలకు వైద్యం అందించే విధంగా నా శాయశక్తులా ప్రయత్నిస్తా.

– డాక్టర్ మౌనిక

క్లుప్తంగా

కోర్టు నిర్మాణ పనులు పరిశీలన

దమ్మపేట: మండల కేంద్రంలో ఏర్పాటుకానున్న కోర్టు నిర్మాణ పనులను జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి అనితావాణి శుక్రవారం పరిశీలించారు. దమ్మపేటలోని ఎస్సీ బాలుర హాస్టల్ భవనంలో కోర్టు ఏర్పాటుకు అనుమతి రాగా, మార్పులు చేపట్టారు. ఈ సందర్భంగా అనితావాణి మాట్లాడుతూ నెలలోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ రాంశెట్టి రమేష్‌తో పాటు దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, పాకలపాటి శ్రీనివాసరావు, మండలపు రాజేంద్రప్రసాద్, మారం సతీష్, బొర్రా వెంకటేశ్వరరావు, గొంది మురళీమోహన్, రాంబాబు పాల్గొన్నారు.

బడిబాట బ్రోచర్లలో ఇల్లెందుకు స్థానం!



ఇల్లెందు: రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకుకు మన ఊరు –మన బడి ద్వారా పనులు చేపట్టింది. ఈమేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆధునీకరించిన పాఠశాలల ఫొటోలతో బ్రోచర్లు ముద్రించింది. ఇందులో ఇల్లెందు స్టేషన్‌బస్తీలోని రెండు పాఠశాలలు, సంజయ్‌నగర్ పీఎస్‌లో తీసిన ఎనిమిది ఫొటోలకు స్థానం దక్కింది.

పోరాటం ఫలించింది..



పాల్వంచలో మహిళా రైతుకు పాస్‌బుక్ అందజేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, ఎంపీ నామా నాగేశ్వరరావు తదితరులు

పోడు సాగుదారుల్లో ఆనందం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/పాల్వంచ/పాల్వంచరూరల్: పాల్వంచలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పోడు పట్టాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై పట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 50,595 మందికి పట్టాలు పంపిణీ చేశారు.

బెంగ లేకుండా సాగు



ఇరవై ఏళ్ల కిందట అష్టకష్టాలు పడి రాళ్లు చెట్లు ఉన్న అడవిని పోడు చేశాను. ఈ భూమిని గుంజుకునేందుకు అటవీశాఖ అధికారులు అనేక సార్లు ప్రయత్నించారు. ప్రతీ ఏడాది వానాకాలం వస్తే అటవీ అధికారులు ఏమంటారో అని గుండెల్లో గుబులుగా ఉండేది. ఈ రోజు పది ఎకరాలు నావేనంటూ ప్రభుత్వం పట్టాలు జారీ చేసింది. ఇకపై ఎలాంటి బెంగ, దిగులు లేకుండా సాగు చేస్తాను.– కుంజ నాగమణి, ఉల్వనూరు, పాల్వంచ మండలం

ఏళ్ల నిరీక్షణ ఫలించింది..



మూడు దశాబ్దాలకు పైగా నిరీక్షణ ఫలిచింది. మా తండ్రి, తాతల నుంచి పోడు భూమిని సాగు చేసుకుని జీవిస్తున్నాం. ఇప్పుడు నాకు 4.10 ఎకరాలకు సంబంధించి పుస్తకం ఇచ్చారు. గిరిజనుల భూములకు ఇప్పుడు పరిష్కారం లభించడం ఆనందంగా ఉంది.

– శ్యాంప్రసాద్, రైతు, పాల్వంచ మండలం

96 మందికి పట్టాలొచ్చాయి..



మా గ్రామంలోనే 96 మంది పోడు రైతులకు హక్కు పట్టా పుస్తకాలొచ్చాయి. 2005 కంటే ముందు నుంచి సాగులో ఉన్నాం. అనేక కేసులను కూడా ఎదుర్కొన్నాం. పోడు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న మాకు ఇప్పుడు పట్టాలు అందించారు. నాకు 2.4 ఎకరాలకు సంబంధించి పట్టా పుస్తకం వచ్చింది.

– చంద్రశేఖర్, బంజర, పాల్వంచ మండలం

ఆందోళన పోయింది



2001 నుంచి ఆరేళ్లు కష్టపడి పదిహేను ఎకరాలు పోడు చేశాం. ఆ భూమిలో ఎప్పుడు పంట సాగుచేసినా.. అటవీ అధికారులు వచ్చి ధ్వంసం చేసేవారు. పదేళ్లుగా ఈ భూమి మాకు దక్కుతుందా దక్కదా అనే దిగులుతో కంటిమీద కునుకు కూడా సక్కగ వచ్చేది కాదు. ఇప్పటికే ఏడు ఎకరాలు ఫారెస్టు వాళ్లు తీసుకున్నారు. మిగిలిన భూమి అయినా ఉంటుందో ఉండదో అనే ఆందోళన ఉండేది. ఇన్నేళ్లకు మా కష్టానికి ఫలంగా ఏడు ఎకరాలకు పట్టాలు జారీ అయ్యాయి. ఆందోళన పోయింది.

– కిన్నెర ఎర్రయ్య, బంజర, పాల్వంచ మండలం

ఊహించలేదు



పదిహేనేళ్ల కిందట రెండెకరాలు పోడు చేశాను. ఆ భూమిని సాగు చేసేందుకు అటవీశాఖ సిబ్బంది నుంచి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. చివరకు ఒక ఎకరమే సాగు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అటవీశాఖ దూకుడు చూస్తే ఈ ఎకరం కూడా ఉంటుందా? లేదా అనే సందేహం కలిగింది. కానీ ప్రభుత్వం ఇప్పుడు సాగులో ఉన్న ఎకరానికి పట్టా జారీ చేసింది. అది కూడా మంత్రి హరీశ్ చేతుల మీదుగా అందింది.

– మడకం కుమారి, కూనవరం, మణుగూరు మండలం

భరోసా లభించింది..



పోడు పట్టాలతో మా కుటుంబానికి భరోసా లభించింది. పట్టాలు లేక సాగు చేసుకుంటున్న భూములు ఉంటాయో లేదో అని ఎంతో ఆవేదన చెందాం. ఎన్నో సంవత్సరాల నుంచి పట్టాల కోసం వేచి చూడగా ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వం పట్టాలిచ్చింది. నాకు 4.5 ఎకరాలకు సంబంధించి పట్టా ఇచ్చారు.

– పద్మావతి, కోమటిపల్లి, సుజాతనగర్ మండలం

రైతుబంధు ఇస్తామనం హర్షణీయం



పోడు పట్టాలతో పాటు రైతుబంధు కింద డబ్బులు కూడా వేస్తామని ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉంది. పోడు వ్యవసాయమే మా కుటుంబానికి ఆసరా. కానీ భూమికి సరైన పత్రాలు లేవు. ఇప్పుడు నాకు 3 ఎకరాలకు హక్కు పుస్తకాలిచ్చారు. మా గ్రామంలో ఇప్పుడు పండుగ వాతావరణం నెలకొంది.

– సోయం భూపతి, మారాయిగూడెం, దుమ్ముగూడెం మండలం

బాధ్యతగా గుర్తించారు..



పోడు భూముల సాగుదారులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యతగా ఇప్పుడు గుర్తించారు. రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ మంచి పనిచేశారు. ఇస్తారా లేదా అనే అనుమానం ఉండేది. ఇప్పుడు పట్టా పుస్తకాలు పంపిణీ చేయడం సంతోషం. అర్హులైన వారిలో రానివారికి కూడా ఇచ్చేలా చూడాలి.

– సోంది రాజు, మారాయిగూడెం, దుమ్ముగూడెం మండలం

మండలాల వారీగా కౌంటర్లు

పాల్వంచ : పోడు రైతులకు పట్టాలు అందించేందుకు అధికారులు మండలాల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన తర్వాత కౌంటర్లలో సిద్ధంగా ఉంచిన పట్టా పాస్ పుస్తకాలను అధికారులు అందించారు.

- ఎంపీ నామా నాగేశ్వరరావు ఆహ్వానం మేరకు రైతు సంఘం నాయకుడు కనగాల అనంతరాములు తదితరులు సభ వద్దకు రాగా కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ అడ్డుకున్నారు. దీంతో కాసేపు వాగ్వాదం జరిగింది. సదరు డీఎస్పీ కవరేజీకి వెళ్లిన మీడియాను సైతం ఇబ్బంది పెట్టారు.
- భోజనాల వద్ద అధికారుల పర్యవేక్షణ లేక రైతులు, ప్రజలు ఒక్కసారిగా లోపలికి వెళ్లడంతో గందరగోళం నెలకొంది.
- పట్టా పుస్తకాలు అందుకున్న తర్వాత అధికారులు, రైతులు, ఆయా గ్రామాల, మండలాల అధికారులు కలిసి సెల్ఫీ దిగుతూ సందడి చేశారు.
- మంత్రుల పర్యటన నేపథ్యంలో స్వాగతం తెలుపుతూ బీసీఎం రహదారిలో డీహెచ్ గడల శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు తొలగించారు.

పట్టాలు రాలేదని విలపించిన రైతులు

పోడు సాగుదారులకు పట్టాలు అందించే జాబితాలో తమ పేర్లు లేవంటూ కొందరు రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. టేకులపల్లి మండలం శంభుని గూడేనికి చెందిన పలువురు రైతులు, మహిళలు సభ వద్దకు వచ్చేందుకు ప్రయత్నించగా సీఐ వినయ్‌కుమార్ వారిని అడ్డుకున్నారు. తమ పక్కనున్న రైతులకు పట్టాలు ఇచ్చారని, తమకు ఇవ్వకపోవడం ఏంటని వారు ప్రశ్నిస్తూ పోలీసుల ఎదుట బోరున విలపించారు. తాము మంత్రులను కలిసేలా చూడాలని వేడుకున్నారు. అయినా పోలీసులు వారిని ముందుకు వెళ్లనీయలేదు.



పట్టాల కోసం ఎండలో నిరీక్షిస్తున్న రైతులు



రైతు సంఘం నాయకులను అడ్డుకుంటున్న డీఎస్పీ రెహమాన్



గడల శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న దృశ్యం

నీడలేక అవస్థలు

పట్టణంలోని సుగుణ గార్డెన్స్ వద్ద పోడుపట్టాల పంపిణీకి అధికారులు నియోజకవర్గాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. అయితే కౌంటర్ల ఎదుట టెంట్లు వేయించకపోవడంతో రైతులు ఎండలోనే గంటల తరబడి నిలబడి అవస్థలు పడ్డారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదని పలువురు రైతులు వాపోయారు.

మావోయిస్టుల శిబిరం ధ్వంసం

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో పోలీసులు మావోయిస్టుల శిబిరాన్ని ధ్వంసం చేశారు. ధనోరా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అసనార్–బట్బేడా అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు జిల్లా ఎస్పీ పుష్కర్‌శర్మ నేతృత్వంలో డీఆర్‌జీ, ఐటీబీటీ విభాగాల పోలీసులు కూంబింగ్ చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం బట్బేడ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల శిబిరానికి సమీపంలో పోలీసు బలగాలకు తారసపడిన సెంట్రీ మావోయిస్టు శిబిరంలోని మావోయిస్టులను అప్రమత్తం చేయడంతో వారు పారిపోయారు. దీంతో పోలీసులు శిబిరాన్ని ధ్వంసం చేసి మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అదే జిల్లాలోని ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలో జాయింట్ ఆపరేషన్ నిర్వహిస్తున్న డీఆర్‌జీ, సీఏఎఫ్ బలగాలకు కనిపించిన ఇద్దరు మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. ఇంకా ఆయా ప్రాంతాల్లో కూంబింగ్ ముమ్మరం చేశారు.

ప్రొటోకాల్ కూడా పాటించరా?

- పోలీసులపై గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ ఆగ్రహం
- పోడు పట్టాల సభా వేదిక వద్ద ప్రజాప్రతినిధుల వాహనాలను నిలిపివేసిన పోలీసులు

పాల్వంచరూరల్: పట్టణంలోని ఇరుకైన గల్లీలో ఉన్న సుగుణ గార్డెన్స్‌లో శుక్రవారం పోడుపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావుతోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ కాన్వాయ్ వాహనాలను ఒక మార్గంలో పోలీసులు అనుమతించారు. మిగిలిన వాహనాలను మరో మార్గంవైపు దారి మళ్లిస్తుండగా మంత్రి వెనుక కాన్వాయ్‌లో వచ్చిన అశ్వారావుపేట ఎమ్మెల్యే ఎం.నాగేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్ వాహనాలను ఎస్‌ఐలు శ్రీనివాస్, నరేశ్ నిలిపివేశారు. అన్ని వాహనాలు అటువైపు వెళ్తే ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని దారి మళ్లిస్తుండగా రాజేందర్ వాహనం దిగి ప్రజాప్రతినిధుల ప్రొటోకాల్‌ను కూడా పాటించరా? అంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో పట్టణ ఎస్‌ఐ వాహనాలను ఆ మార్గంలో వెళ్లేందుకు అనుమతిలించారు.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దిండిగాల రాజేందర్



కారు దిగి వెళ్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ఇద్దరు తల్లులకు గర్భశోకం

వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువులు మృతి చెందారని బాధితుల ఆరోపణ





ఆస్పత్రిలో సాధారణ కాన్పులు అయిన మౌనిక, దివ్య

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఇద్దరు తల్లులకు గర్భశోకం మిగిలింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పేరాయిగూడేనికి చెందిన గంధం దివ్య పురిటి నొప్పులతో గురువారం, నారంవారిగూడేనికి చెందిన మనుగొండ మౌనిక శుక్రవారం అశ్వారావుపేటలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేరారు. వీరిద్దరికీ ఆస్పత్రి సిబ్బంది సాధారణ కాన్పులు చేయగా దివ్యకు ఆడ, మౌనికకు మగ శిశువులు జన్మించారు. కాగా దివ్యకు జన్మించిన శిశువుకు జ్వరం రావడంతో కుటుంబీకులు స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. శుక్రవారం మరోసారి జ్వరం రావడంతో భయాందోళనకు గురైన కుటుంబీకులు సత్తుపల్లిలోని పిల్లల వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా, వైద్యం అందించే క్రమంలోనే శిశువు మృతి చెందింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో సకాలంలో వైద్యం చేయడంలో నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి చెందిందని దివ్య బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన దిగారు. అలాగే మౌనికకు మగబిడ్డ జన్మించగా, కాన్పు చేసిన వైద్యుడు నర్సయ్య శిశువులో కదలిక లేదని, పిల్లల వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. తక్షణమే బంధువులు జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేటు పిల్లల వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. ఇలా ఒకే రోజు ఇద్దరు నవజాత శిశువులు మృతికి వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. దీనిపై సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పూర్ణచంద్‌ను వివరణ కోరగా.. దివ్యకు ఆడ బిడ్డ కాన్పు సమయంలో పేగు మెడకు చుట్టుకొని ఉండటం, జ్వరం రావడం, మౌనిక మగ బిడ్డ సరైన ఎదుగుదల లేకపోవడం, కేవలం 1.2 కేజీలే ఉండటంతో పాటు నెలలు నిండకపోవడం కారణమన్నారు. దీంట్లో తమ వైద్య సిబ్బంది నిర్లక్ష్యమేమీ లేదన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి: మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘ టన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తొట్టిపంపు గ్రామానికి చెందిన కుంజా కన్నయ్య (50) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన పత్తి చేనులో గురువారం కూలీలతో కలిసి పత్తి విత్తనాలు నాటారు. సాయంత్రం సమయంలో మద్యం సేవించి, ఇంటికి వచ్చి కలుపుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎర్రగుంట పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించే క్రమంలో చనిపోయాడు. మృతుడి భార్య భద్రమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ షాహీన కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గుండాల: మద్యం మత్తులో ఓ వ్యక్తి పురుగులమందు తాగి కొత్తగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మండలంలోని కొడవటంచ గ్రామానికి చెందిన కొటెం ప్రభాకర్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నాలుగు రోజుల కిందట పురుగులమందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు గుండాల ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

కొత్తగూడెం ఏరియాలో 119 శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొత్తగూ డెం ఏరియాలో జూన్ నెలకు సంబంధించి 119 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైందని ఏరియా జనరల్ మేనేజర్ శాలేం రాజు తెలిపారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. జూన్‌లో 9.89 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 11.78 లక్షల టన్నుల ఉత్పత్తి నమోదైందని తెలిపారు. అలాగే, రోడ్డు, రైలు మార్గాల ద్వారా 12.96 లక్షల టన్నులు రవాణా చేసినట్లు వివరించారు. ఏరియాలోని జేవీఆర్‌ఓసీ–2లో 8 లక్షల టన్నుల లక్ష్యానికి 9.29 లక్షల టన్నులు, కిష్టారం ఓసీలో 1.50 లక్షల టన్నులకు 2.19 లక్షల టన్నుల ఉత్పత్తి అయిందని తెలిపారు. కాగా, కొత్తగూడెం ఏరియాలో ఇప్పటి వరకు 511 మంది డిపెండెంట్లకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వగా, ఇంటి రుణాన్ని 352 మందికి మంజూరు చేసినట్లు జీఎం చెప్పారు. సమావేశంలో ఏజీఎంలు రఘురామిరెడ్డి, శామ్యూల్ సుధాకర్, రామకృష్ణ, డీజీఎం యోహాన్, అధికారులు తావురియా, సుధాకర్, సాగర్, నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శాలేం రాజు

కేటీపీఎస్ ఉద్యోగిపై బదిలీ వేటు

పాల్వంచ: కేటీపీఎస్‌లో ఓ ఉద్యోగిపై బదిలీ వేటు పడింది. గత మార్చిలో కేటీపీఎస్ ఉద్యోగి బస్టాండ్ సెంటర్‌లో ఓ జాతీయ నేత విగ్రహం ఏర్పాటుకు చందాలు ఇవ్వాలని వ్యాపారులను బెదిరించారనే ఆరోపణలు రావడంతో కేసు నమోదైంది. అలాగే, జెన్‌కో యాజమాన్యానికి ఫిర్యాదు అందగా, క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను భూపాలపల్లికి బదిలీ చేశారు. ఈవిషయాన్ని సీఈ పి.వెంకటేశ్వరరావు ధృవీకరించారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

చుంచుపల్లి: మద్యం మత్తులో నలుగురు యువకులు ఘర్షణకు దిగిన సంఘటన శుక్రవారం విద్యానగర్ బైపాస్ రోడ్డు వద్ద జరిగింది. రామవరానికి చెందిన యువకులు విద్యానగర్ బైపాస్‌లోని ఓ బెల్ట్‌షాపులో మద్యం తాగాక ఘర్షణ పడ్డారు. పరస్పర దాడుల్లో ఒకరికి గాయాలు కాగా, కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటన వివరాలను చుంచుపల్లి పోలీసులు ఆరా తీస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబం ఆందోళన

పాల్వంచరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కిరాణా వ్యాపారి మృతి చెందాడు. స్థా నిక నవభారత్ సమీపంలోని గాంధీనగర్‌లో నివాసముండే కిరాణా వ్యాపారి గాజుల కోటేశ్వరరావు (42) శుక్రవారం పెద్దమ్మగుడి వద్ద ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా కేశవాపురం సమీపాన ద్విచక్రవాహనం పైనుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే, వైద్యులు అందుబాటులో లేక సకాలంలో వైద్యం అందకపోవడంతోనే ఆయన మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐలు నరేశ్, శ్రీనివాసరావు చేరుకుని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయమై ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావును వివరణ కోరగా కోటేశ్వరరావును ఆస్పత్రికి తీసుకురాగానే బీపీ చెక్ చేస్తే అప్పటికే మృతి చెందాడని తెలిపారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ శ్రీనివాస్ ఇతర విధుల్లో ఉన్నాడే తప్ప తమ నిర్లక్ష్యం ఏమీ లేదని చెప్పారు.



కోటేశ్వరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

వాగులో ట్రాక్టర్ బోల్తా : రైతు మృతి

టేకులపల్లి: సాగు పనులకు సిద్ధమవుతున్న రైతు ట్రాక్టర్ బోల్తా పడడంతో వాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు. మండలంలోని మొక్కంపాడుకు చెందిన రైతు, తెలంగాణ రైతాంగ సమితి జిల్లా అధ్యక్షుడు కుంజా వెంకటేశ్వర్లు (43) భార్యతో కలిసి శుక్రవారం సాయంత్రం తమ వ్యవసాయ భూమిలో ట్రాక్టర్‌తో దున్నేందుకు వెళ్లాడు. వాగుఒడ్డున ఉన్న భూమిలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా అదుపుతప్పి వాగులో బోల్తాపడింది. ట్రాక్టర్‌తో పాటు వెంకటేశ్వర్లు కూడా వాగులో కొంతదూరం వెళ్లినా కలప దుంగ అడ్డం వచ్చి ఆగిపోయారు. కానీ, ట్రాక్టర్‌కి చెందిన రాడ్డు వెంకటేశ్వర్లు చాతికి అనుకుని ఉండటంతో ఆయన బయటకు రాలేకపోయారు. ఇంతలోనే భార్య అరుస్తుండటంతో చుట్టుపక్కల భూముల్లో పనిచేస్తున్న మహిళలు వచ్చినా రక్షించడం సాధ్యం కాలేదు. ఆ తర్వాత గ్రామస్తులు చేరుకుని ఆయనను బయటకు తీసి సులానగర్ పీహెచ్‌సీకి అక్కడి నుంచి కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందాడు. వెంకటేశ్వర్లుకు భార్య సత్యవతి, ఇద్దరు కుమార్తెలున్నారు.



వెంకటేశ్వర్లు (ఫైల్)

సాక్షి ఫ్యామిలీ
IV
ఖమ్మం
శనివారం ॥ 1-7-2023

✻ మనం మాట్లాడుకోవాల్సిందే!

అధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

•••

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.


ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లీ, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టేస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

•••

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కోవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హార్డ్‌గా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుదనాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటెలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటి, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది'' అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

"నా నెక్స్ట్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా. నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.

న్యూస్‌మేకర్


సాబ్రి

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

మరో స్వర్ణకమలం

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి


డ్యాన్స్ క్లాస్‌లో ...

దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కానివ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్టాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.

కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్తుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...

ది బాస్ లేడీ


ఆష్క గొరాదియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవి సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.



కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్‌షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.


యుఎస్పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.

తోడు దొంగలు దొరికారిలా..

బాబు, నారాయణ క్విడ్ ప్రో కో బట్టబయలు

- చంద్రబాబు కరకట్ట నివాసం అటాచ్‌మెంట్‌కు అనుమతి
- నారాయణ కుటుంబ సభ్యుల ప్లాట్లు, రూ.1.92 కోట్ల బ్యాంకు ఖాతాలు కూడా..
- ఏసీబీ న్యాయస్థానం ఆదేశాలు జారీ
- అమరావతి పేరిట టీడీపీ ప్రభుత్వం భారీ భూబాగోతం
- సీడ్ క్యాపిటల్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌లో అక్రమాలు
- క్విడ్ ప్రో కోలో భాగంగానే చంద్రబాబుకు కరకట్ట నివాసం
- నారాయణ కుటుంబ సభ్యులకు అమరావతిలో ప్లాట్లు
- సిట్ దర్యాప్తులో ఆధారాలతో సహా బట్టబయలు



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన అమరావతి భూ కుంభకోణాల బాగోతం బట్టబయలైంది. చంద్రబాబు, అప్పటి మంత్రి పొంగూరు నారాయణ ద్వయం భూ దోపిడీ నిర్ధారణ అయ్యింది. అమరావతిలో సీడ్ క్యాపిటల్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ పేరిట క్విడ్ ప్రో కోకు పాల్పడ్డారన్నది స్పష్టమైంది. ఈ కేసులో ఏ–1గా ఉన్న చంద్రబాబు కరకట్ట నివాసాన్ని అటాచ్ చేసేందుకు న్యాయస్థానం అనుమతినిచ్చింది. దాంతోపాటు ఈ కేసులో ఏ–2గా ఉన్న పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీల పేరిట అమరావతిలో ఉన్న 75,888 చదరపు గజాల ఇళ్ల స్థలాలు, భూ సమీకరణ కింద పొందిన కౌలు మొత్తం రూ.1.92 కోట్లను కూడా అటాచ్ చేసేందుకు న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం శుక్రవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. చంద్రబాబు కరకట్ట నివాసం, నారాయణ కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఉన్న ప్లాట్లు, బ్యాంకు నిల్వలను బదలాయించేందుకు మార్పులు చేసేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. ఆ ఆస్తుల అటాచ్‌మెంట్ కోసం జులై 14 లోపు నోటీసులు జారీ చేయాలని కూడా ఆదేశించింది. ఈ కేసులో పూర్తి స్థాయి అటాచ్‌మెంట్ కోసం కేసు విచారణ కొనసాగుతుందని తెలిపింది. దాంతో అమరావతి భూ కుంభకోణం ద్వారా చంద్రబాబు, నారాయణ, వారి బినామీలు భారీగా అవినీతికి పాల్పడ్డారని నిగ్గుతేలింది. అమరావతిలో చంద్రబాబు, నారాయణ సాగించిన భూ అక్రమాలను సిట్ నిర్ధారించిది. క్విడ్ ప్రో కో కింద పొందిన కరకట్ట నివాసం, అమరావతిలో ప్లాట్లు, భూ సమీకరణ కింద పొందిన కౌలు మొత్తాన్ని అటాచ్ చేసేందుకు అనుమతించాలన్న సిట్ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. ఆ మేరకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఆ ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని సిట్ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై రెండు నెలల విచారణ అనంతరం న్యాయస్థానం అటాచ్‌మెంట్‌కు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దాంతో చంద్రబాబు కరకట్ట నివాసం, నారాయణ కుటుంబ సభ్యుల ప్లాట్లు, బ్యాంకు ఖాతాల అటాచ్‌మెంట్ కోసం సీఐడీ చర్యలు తీసుకోనుంది.

అటాచ్ చేయనున్న చంద్రబాబు, నారాయణ ఆస్తులు

- ఏ–1 చంద్రబాబు కరకట్ట నివాసం (లింగమనేని రమేశ్ కుటుంబం పేరిట ఉన్న ఈ నివాసాన్ని చంద్రబాబు క్విడ్ ప్రో కో కింద పొందారు)
- ఏ–2 పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీల పేరిట అమరావతిలో ఉన్న 75,888 చదరపు గజాల ఇళ్ల స్థలాలు
- ఏ–2 నారాయణ భార్య పొత్తూరి ప్రమీల, కుటుంబ సభ్యులు, బంధువులు రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప భూ సమీకరణ కింద ఇప్పటి వరకు పొందిన కౌలు మొత్తం రూ.1.92,11,482

చంద్రబాబు అవినీతి మాస్టర్‌ప్లాన్

అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనే ఏ–1 చంద్రబాబు, ఏ–2 నారాయణ భారీ అవినీతికి పాల్పడినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణలో ఆధారాలతో సహా బట్టబయలైంది. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు టీడీపీ ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో కన్సల్టెన్సీని ఎంపిక చేసింది. లింగమనేని రమేశ్, లింగమనేని రాజశేఖర్, హెరిటేజ్ ఫుడ్స్, చంద్రబాబు బినామీలకు చెందిన భూములు ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా.. వారి భూముల వెలుపలి నుంచే ల్యాండ్ పూలింగ్ చేసేలా మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేశారు. అందుకు ప్రతిగా చంద్రబాబు కుటుంబానికి లింగమనేని కుటుంబం భారీగా ప్రతిఫలాన్ని ముట్టజెప్పింది. ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న భూములను హెరిటేజ్ ఫుడ్స్‌కు 'అమ్మినట్టు'ఇవ్వడంతో సరిపెట్టకుండా, కృష్ణా నది కరకట్ట మీద ఉన్న నివాసాన్ని కూడా చంద్రబాబుకు అప్పగించింది.

బినామీల పేరుతో 75,888 చ.గజాలు

నారాయణ తమ బంధువులు, బినామీల పేరిట సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో కొనుగోలు చేసిన 65.50 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద సీఆర్‌డీయేకు ఇచ్చారు. అందుకు ప్రతిగా ల్యాండ్ పూలింగ్ ప్యాకేజీ కింద సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో అత్యంత విలువైన 75,888 చ.గజాల స్థలాలను పొందారు. వాటిలో 7,620 చ.గజాలు, 8,880 చ.గజాలు, 6,550 చ.గజాలు, 25 వేల చ.గజాల స్థలాలు కూడా ఉండటం... అవి నేరుగా సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానించి ఉండటం గమనార్హం. పూలింగ్ ప్యాకేజీ కింద ఏటా సీఆర్‌డీఏ ఇప్పటి వరకు చెల్లించిన రూ.1.92 కోట్ల కౌలు మొత్తం ఎన్‌స్పైరా ఖాతాల్లో జమ చేస్తున్నారు. అంటే ఆ భూములు కొనుగోలు చేసి సీఆర్‌డీఏకే ఇచ్చినట్టు పేర్కొన్న పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప్ప నారాయణ బినామీలేనన్నది నిర్ధారణ అయ్యింది.

వారి భూముల సమీపం నుంచే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ రూపొందించడంలోనూ చంద్రబాబు, నారాయణ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. లింగమనేని కుటుంబం, హెరిటేజ్ ఫుడ్స్, నారాయణ విద్యా సంస్థల సమీపం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా చంద్రబాబు, నారాయణ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. అందుకోసం సామాన్య రైతుల భూముల గుండా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. అందుకోసం ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు కూడా సీఆర్‌డీయే అనుమతులు నిలిపివేసింది. అంటే కన్సల్టెన్సీ సంస్థ అలైన్‌మెంట్‌ను రూపొందించకముందే చంద్రబాబు, నారాయణ ఇన్నర్‌రింగ్ రోడ్డు ఎలా నిర్మించాలో నిర్ణయించేశారు. వాస్తవానికి విజయవాడలోని కామినేని ఆసుపత్రి వద్ద ఉన్న తాడిగడప– ఎనికేపాడు మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించాలని కన్సల్టెన్సీ సంస్థ ఎస్‌టీయూపీ అలైన్‌మెంట్‌ను రూపొందించింది. అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూముల గుండా రోడ్డును నిర్మించాల్సి వస్తుంది. దీనిపై అప్పటి సీఆర్‌డీయే వైస్ చైర్మన్‌గా ఉన్న నారాయణ సీఆర్‌డీయే సమావేశంలోనే అధికారులపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. తాడిగడపకు 3 కి.మీ. దూరంగా తూర్పు వైపు నుంచి పెనమలూరు– నిడమానూరు మీదుగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను మార్పించారు. ఈ అక్రమాలన్నీ నిర్ధారణ అయ్యాయి. క్రిడ్ ప్రో కో కు పాల్పడినట్టు న్యాయస్థానం కూడా భావించి.. చంద్రబాబు, నారాయణ ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతినిచ్చింది.

బెడిసికొట్టిన పన్నాగం

- కరకట్ట నివాసంపై న్యాయస్థానాన్ని, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు జీతంతో పాటు హౌస్ రెంట్ అలవెన్స్ (ఇంటి అద్దె అలవెన్స్) కూడా తీసుకున్నారు. కానీ చంద్రబాబు 2017 నుంచి తాను ఉంటున్న కరకట్ట నివాసానికి గాను లింగమనేని కుటుంబానికి అద్దె చెల్లించినట్టు ఎక్కడా బ్యాంకు లావాదేవీలు లేవు. చంద్రబాబు నుంచి తీసుకున్న అద్దెకు లింగమనేని ఎక్కడా జీఎస్టీ చెల్లించనే లేదు. దీన్నిబట్టి క్విడ్ ప్రో కోలో భాగంగానే కరకట్ట నివాసాన్ని చంద్రబాబుకు లింగమనేని ఇచ్చారన్నది సుస్పష్టమైంది.
- కరకట్ట నివాసంపై తప్పుదోవ పట్టించేందుకు లింగమనేని రమేశ్ కూ డా యత్నించారు. తాను దేశభక్తితోనే కరకట్ట నివాసాన్ని అప్పటి ప్రభుత్వం వాడుకునేందుకు ఉచితంగా ఇచ్చానని న్యాయస్థానానికి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఇంటిని ఉచితంగా ఇస్తే చంద్రబాబు ప్రజాధనం నుంచి ఇంటి అద్దె అలవెన్స్‌ను ఎందుకు తీసుకుంటున్నారని సిట్ అధికారులు ప్రశ్నించగా లింగమనేనికి నోట మాట రాలేదు.
- దేశభక్తితో ఉచితంగా ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలి గానీ, చంద్రబాబుకు వ్యక్తిగతంగా ఇవ్వడం ఏమిటంటే కూడా సమాధానం లేదు. ప్రభుత్వానికే ఉచితంగా ఇచ్చి ఉంటే.. చంద్రబాబు సీఎం పదవి నుంచి దిగిపోగానే ఆ ఇంటిని ఖాళీ చేసి ప్రభుత్వానికి అప్పగించాలి.
- 2019లో సీఎం పదవి నుంచి దిగిపోయిన తర్వాత కూడా చంద్రబాబు అదే కరకట్ట నివాసంలో ఉంటున్నారు. అంటే లింగమనేని దేశ భక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారన్నది అవాస్తవం. క్విడ్ ప్రో కో లో భాగంగానే ఆయన చంద్రబాబుకు ఇచ్చారన్నది నిర్ధారణ అయ్యింది.

లింగమనేని నుంచి హెరిటేజ్ ఫుడ్స్‌కు భూమి

కరకట్ట నివాసమే కాదు లింగమనేని కుటుంబం భూములను కూడా చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్‌కు అప్పగించిందన్నది కూడా సిట్ దర్యాప్తులో వెల్లడైంది. 2014లో లింగమనేని కుటుంబ సభ్యుల నుంచి హెరిటేజ్ ఫుడ్స్ 4 ఎకరాల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు చూపించారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూమినే హెరిటేజ్ ఫుడ్స్‌కు బదలాయించారు. ఆ సమయంలో నారా లోకేశ్ డైరెక్టర్‌గా ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై మంత్రి కూడా అయిన లోకేశ్ అదే లింగమేని కుటుంబం ఇచ్చిన కరకట్ట మీద నివాసంలోనే నివసించారు.

సీడ్ క్యాపిటల్‌లో వేళ్లూనుకున్న అవినీతి

అమరావతికి గుండెకాయ వంటి సీడ్ క్యాపిటల్‌లో కూడా ఏ–1 చంద్రబాబు, ఏ–2 నారాయణ భారీగా భూ అక్రమాలకు పాల్పడ్డారు. శాసనసభ, సచివాలయం మొదలైన ప్రధాన విభాగాలన్నీ కూడా సీడ్ క్యాపిటల్ పరిధిలోనే నిర్మిస్తామని ప్రకటించడంతో ఆ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరుగుతాయి. అందుకే సీడ్ క్యాపిటల్‌లో పూర్తిగా తమ వాటా భూములే ఉండేట్టుగా వారు వ్యవహారం సాగించారు. సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను కన్సల్టెన్సీ సంస్థ ప్రభుత్వానికి 2015 జూలైలోనే సమర్పించినప్పటికీ ఆమోదించకుండా మూడు నెలలపాటు కాల యాపన చేశారు. ఆ మూడు నెలల్లోనే నారాయణ తమ బినామీలు, బంధువులైన పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప్ప పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో 65.50 ఎకరాలు కొనుగోలు చేశారు. అందుకోసం నారాయణ భార్య రమాదేవి, అల్లుడు డైరెక్టర్లుగా ఏర్పాటు చేసిన ఎన్‌స్పైరా కంపెనీ నుంచి నిధులను తమ బంధువులు, బినామీల ఖాతాల్లోకి మళ్లించారు. వారి పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరును బినామీగా పెట్టుకుని కూడా నారాయణ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. నారాయణ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాకు నిధులు బదిలీ చేశారు. ఆ నిధులతో ఆ కంపెనీ ఉద్యోగుల పేరున భూములు కొనుగోలు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆ ఉద్యోగులను సిట్ అధికారులు ప్రశ్నించగా తాము నారాయణ బినామీలుగానే భూములు కొనుగోలు చేశామని వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సెంథిల్ బాలాజీ డిస్మిస్ ఉత్తర్వులు వెనక్కి

తమిళనాడు గవర్నర్ యూటర్న్

సాక్షి, చెన్నై: తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ వ్యవహారంలో గవర్నర్ ఆర్ఎన్ రవి యూటర్న్ తీసుకున్నారు. సెంథిల్ బాలాజీని మంత్రి వర్గం నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఐదు గంటల వ్యవధిలోనే గవర్నర్ వెనక్కి తగ్గారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా గవర్నర్ వ్యవహరిస్తున్న తీరుపై చట్ట పోరాటానికి సీఎం స్టాలిన్ సిద్ధమయ్యారు. సెంథిల్‌ను డిస్మిస్ చేస్తూ గురువారం రాత్రి గవర్నర్ రవి ఉత్తర్వులు జారీ చేశారు. స్పందించిన సీఎం స్టాలిన్ చట్టపరంగా గవర్నర్‌ను ఎదుర్కొంటామని చెప్పారు. ఇది జరిగిన ఐదు గంటల్లోనే డిస్మిస్ ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటూ గవర్నర్ రవి మరో ప్రకటన చేశారు. గవర్నర్ జారీ చేసిన డిస్మిస్ ఉత్తర్వులపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పందించి తన కార్యాలయ వర్గాల ద్వారా గవర్నర్‌కు సూచనలు చేశారు. అటార్నీ జనరల్ అభిప్రాయం తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అటార్నీ జనరల్ తుషార్ మెహతాతో గవర్నర్ ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. ఆయన సలహా మేరకు డిస్మిస్ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నట్టు తెలుస్తోంది.

వివేకా హత్య కేసులో సీబీఐ చార్జ్‌షీట్

కోర్టుకు హాజరుకాని కీలక నిందితుడు దస్తగిరి

సాక్షి, హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సప్లిమెంటరీ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. 2019 మార్చి 15న హత్యకు గురైన వివేకా కేసు.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ అయ్యాక సీబీఐ తొలిసారి చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఇందులో ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఏ–6), వైఎస్ భాస్కర్‌రెడ్డి(ఏ–7), వైఎస్ అవినాశ్‌రెడ్డి(ఏ–8)లతో పాటు అనుమానిత నిందితుల కింద వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డిని ఏ–9గా, ఏదుల ప్రకాశ్‌ను ఏ–10గా పేర్కొంది. విచారణ సందర్భంగా గంగిరెడ్డి(ఏ–1), సునీల్ యాదవ్(ఏ–2), ఉమాశంకర్‌రెడ్డి(ఏ–3), శివశంకర్‌రెడ్డి(ఏ–5), ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఏ–6), వైఎస్ భాస్కర్‌రెడ్డి(ఏ–7) హాజరయ్యారు. చంచల్‌గూడ జైలులో ఉన్న వీరిని పోలీసులు కోర్టుకు తరలించారు. కాగా, దస్తగిరి(ఏ–4) మాత్రం విచారణకు హాజరు కాలేదు. చార్జీషీట్ దాఖలు చేసిన తర్వాత విచారణను న్యాయమూర్తి ఈ నెల 14వ తేదీకి వాయిదా వేశారు. ఏపీలో విచారణలో ఉండగా రెండుసార్లు చార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం విదితమే. ఇదిలా ఉండగా, కేసు దర్యాప్తునకు సీబీఐకి సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు జూన్ 30తో ముగిసింది. ఈ నేపథ్యంలో ఈ గడువును పొడిగించాలని సీబీఐ కోరనుందా అనేది తెలియాల్సి ఉంది.

జిల్లా వార్తలు

కిన్నెరసానిలో కిష్కింధకాండ!



మనకు పనికిరాదు...



ఇందులో ఏమున్నాయో?



జామకాయలా.. అయితే ఓకే!



కాస్త దూరం వెళ్లి తినేద్దాం..

పాల్వంచ మండలంలో పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో కోతుల బెడద వేధిస్తోంది. పర్యాటకులు తమ వాహనాలను డ్యామ్ సమీపాన పార్కింగ్ చేసి లోనకు వెళ్లి వచ్చే సరికి గుంపుగా వస్తున్న కోతులు కవర్లను తొలిగించి అందులో ఉన్న వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. పండ్లు, తినుబండారాలు ఉంటే క్షణంలో ఖాళీ చేస్తున్నాయి. కోతులను అదిలిస్తే తిరగబడుతుండడంతో పర్యాటకులు చేసేదేం లేక చూస్తూ ఊరుకోవాల్సి వస్తోంది.

– పాల్వంచ రూరల్

ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రీ, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో ఏఎన్‌ఎం పోస్టులను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. ఎస్సెస్సీ లేదా ఇంటర్ పాసై, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల్లో ఏఎన్‌ఎం, సమానమైన శిక్షణ పూర్తిచేసుకున్న గిరిజన మహిళలు అర్హులని పేర్కొన్నారు. మార్కులు, అనుభవం ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నియామకం

2023–24 విద్యాసంవత్సరానికి గాను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో టీటీడబ్ల్యూఆర్‌ఈ అండ్ టీఎస్ ఈఎస్ గురుకుల విద్యాలయ సంస్థలకు సిబ్బందిని నియమించేందుకు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను ఎంపిక చేయనున్నట్లు ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. ఆసక్తి ఉన్న ఏజెన్సీల బాధ్యులు ఈ నెల నాలుగో తేదీలోగా టెండర్లు సమర్పిస్తే అర్హతల ఆధారంగా ఎంపిక చేస్తామని పీఓ పేర్కొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల నడుమ కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయంలో అర్చకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, రాష్ట్ర ప్రజా ఆరోగ్య సంచాలకులు(హెల్త్ డైరెక్టర్) గడల శ్రీనివాసరావు తన పుట్టిన రోజు సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయగా, అర్చకులు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మతోపాటు ఈఓ ఎస్.రజనీకుమారి, చైర్మన్ మహిపతిరామలింగం, సభ్యులు చింత నాగరాజు, గంధం వెంగళరావు పాల్గొన్నారు.



పెద్దమ్మతల్లి సన్నిధిలో డీహెచ్ శ్రీనివాసరావు

3 నుంచి పీజీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

- 5, 6వ తేదీల్లో పరీక్ష కేంద్రం మార్పు

ఖమ్మంసహకారనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈనెల3 నుంచి 7వ తేదీ వరకు జరగనున్నాయని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అంబేడ్కర్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. జూలై 3, 4, 7వ తేదీల్లో ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, 5వ తేదీన కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, 6వ తేదీన యూనివర్సిటీ పీజీ కళాశాలలో పరీక్షలు జరుగుతాయయని పేర్కొన్నారు. ఈనెల 5, 6వ తేదీల్లో న్యాక్ బృందం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలను సందర్శించనున్న నేపథ్యాన పరీక్ష కేంద్రాలను మార్చినట్లు ప్రిన్సిపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

భద్రాద్రి సీతారామచంద్ర స్వామివారికి వినతిపత్రం

భద్రాచలంటౌన్: రాష్ట్రంలో మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు దశలవారీ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకుని పూజలు చేశాక వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో దేవయ్య మాట్లాడుతూ మున్నూరుకాపులను అన్ని పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఆరోపించారు. ఇకనైనా రూ.5 వేల కోట్లతో ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాక అన్ని జిల్లాల్లో విద్యార్థులకు హాస్టల్ భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పిన్నింటి రాజశేఖర్‌తో పాటు ముత్యాల రాజశేఖర్, ప్రసాద్, బాపట్ల మురళి, తమ్మళ్ల వెంకటేశ్వరరావు, నాగభూషణం, కృష్ణ, దుర్గాప్రసాద్, పుదోట సూరిబాబు, దేవా తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాలతో మున్నూరుకాపు సంఘం నాయకులు

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడితో భేటీ

సింగరేణి(కొత్తగూడెం): జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్‌ను శుక్రవారం ఢిల్లీలో సింగరేణి డైరెక్టర్ ఎన్.బలరామ్ కలిశారు. ఈ సందర్భంగా సంస్థలో ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులు, ఆర్ఓఆర్, బ్యాక్‌లాగ్ ఇతర సమస్యలపై చర్చించారు. ఈమేరకు స్పందించిన అనంతనాయక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య, ఏజీఎం పర్సనల్ కోడూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అనంతనాయక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బలరామ్

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ



సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: వ్యవసాయం, గృహావసరాలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ తెలిపారు. మండలంలోని పోలారంలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించనున్న 132 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, రైతు బంధు రాష్ట్ర సలహాదారు పులిగళ్ల మాధవరావు, సర్పంచ్ వాంకుడోత్ సరోజిని, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుకతో పాటు దాస్యం ప్రమోద్‌కుమార్, జనగం కోటేశ్వరరావు, యలమద్ది రవి, మల్సూర్, కవిత, లష్కర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యే పోలారం వెళ్తుండగా తాగునీటి సమస్యపై కొమరారం మహిళలు ఖాళీ బిందెలతో అడ్డుకున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ సమస్యతో ఇబ్బంది ఎదురవుతోందని చెప్పగా.. క్యాంపు కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తాం కదా అని ఎమ్మెల్యే వాహనం ఎక్కారు. పోలీసులు మహిళలకు నచ్చచెప్పి ఆందోళన విరమింపచేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సండ్ర

తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామిని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు ఆయనకు స్వామివారి శేష వస్త్రాలు అందజేశారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. – సత్తుపల్లి



ఆలయం వద్ద కుటుంబంతో ఎమ్మెల్యే వెంకటవీరయ్య

బౌద్ధక్షేత్రాన్ని సందర్శించిన తమిళనాడు అధికారి

నేలకొండపల్లి: దక్షిణభారత దేశంలోకెల్లా అతి పెద్దదైన బౌద్ధక్షేత్రం, రామదాసు జన్మస్థలంలోని ధ్యాన మందిరాన్ని తమిళనాడు రాష్ట్ర రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశ్ తన కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి శుక్రవారం సందర్శించారు. వారితో రామదాసు ధ్యాన మందిరంలో పూజారి సౌమిత్రి రమేశ్ పూజలు చేయించాక రామదాసు వాడిన బావి, బౌద్ధక్షేత్రంను సందర్శించి విశిష్టతను తెలుసుకున్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్‌చక్రవర్తి, భక్తరామదాసు విద్వత్ కళాపీఠం అధ్యక్షుడు సాధు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రామదాసు ధ్యాన మందిరంలో పూజలు నిర్వహిస్తున్న వెంకటేశ్